నాదర్‌గుల్-గాంధీనగర్ రహదారిపై సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలి


సబితారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న జంగయ్య, నరేశ్‌చారి

సరూర్‌నగర్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): నాదర్‌గుల్-గాంధీనగర్ రహదారి విస్తరణ అనంతరం సదరు రోడ్డు మధ్యలో డివైడర్ నిర్మింపజేసి, సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని స్థానిక బీఆర్‌ఎస్ నేతలు ఎమ్మెల్యే సబితారెడ్డిని కోరారు. ఈ మేరకు గురువారం పార్టీ నేతలు రామోజీ నరేశ్‌చారి, కోటగిరి జంగయ్య తదితరులు ఎమ్మెల్యేను క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాదర్‌గుల్-గాంధీనగర్-బడంగ్‌పేట్ రహదారి విస్తరణ సబితారెడ్డి ప్రత్యేక చొరవతోనే సాధ్యమైందని అన్నారు. ఇప్పటికే బడంగ్‌పేట్-గాంధీనగర్ రోడ్డు విస్తరణ పూర్తైందని, ప్రస్తుతం గాంధీనగర్-నాదర్‌గుల్ రోడ్డు విస్తరణ పనులు కొనసాగుతున్నాయని వారు పేర్కొన్నారు. ఈ విస్తరణ పనులు పూర్తైన వెంటనే డివైడర్, సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ ఏర్పాటు చేయించాలని వారు ఎమ్మెల్యేను కోరారు. తాను అధికారులతో మాట్లాడి సత్వర చర్యలు తీసుకునేలా చూస్తానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు.

అంతర్జాతీయ పోటీల్లో ఆడేందుకు సహకరిస్తా

● మధుయాష్కీ


క్రీడాకారిణికి ఆర్థికసాయం అందజేస్తున్న మధుయాష్కీగౌడ్

మన్సూరాబాద్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఐస్, రోలర్ స్కేటింగ్ విభాగాల్లో జాతీయ స్థాయిలో ప్రతిభచాటిన క్రీడాకారిణికి అంతర్జాతీయ స్థాయిలో జరిగే పోటీల్లో ఆడేందుకు సహకరిస్తానని టీపీసీసీ ప్రచారకమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్ భరోసానిచ్చారు. నాగోల్ డివిజన్ లలితానగర్‌కాలనీకి చెందిన నర్సిరెడ్డి, పద్మ దంపతుల కుమార్తె కె.మహన్యారెడ్డి ఐస్, రోలర్ స్కేటింగ్ విభాగాల్లో జాతీయ స్థాయిలో పతకాలు సాధించింది. కాగా అంతర్జాతీయ స్థాయి పోటీల్లోనూ ఆడేందుకు ప్రభుత్వం నుంచి సహకారం కావాలని కోరుతూ మహన్యారెడ్డి తన తల్లిదండ్రులతో కలిసి వనస్థలిపురంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మధుయాష్కీగౌడ్‌ను కలిసారు. ఇందుకు స్పందించిన ఆయన తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ నుంచి అన్ని విధాలా సహకారం అందేలా చూస్తానని, స్కేటింగ్ క్రీడపై మరింత దృష్టి సారించి ఉన్నత స్థానాలకు ఎదగాలని క్రీడాకారిని మహన్యారెడ్డిని ప్రోత్సహించారు. అనంతరం తన వంతుగా కొంత ఆర్థిక సాయాన్ని ఆమెకు మధుయాష్కీగౌడ్ అందజేశారు.

ఆత్మరక్షణకు కరాటే ఉపయోగం: గువ్వల


శాన్వినాయక్‌ను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే గువ్వల బాల్‌రాజ్

చంపాపేట, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి):ఆత్మరక్షణ కోసం కరాటే ఎంతో ఉపయోగపడుతుందని అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాల్‌రాజ్ అన్నారు. హస్తినాపురం డివిజన్‌లోని నాగార్జున పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని రామావత్ శాన్వినాయక్ నవంబర్ 26నుంచి డిసెంబర్ 3వరకు మలేషియాలో జరగనున్న అంతర్జాతీయ అండర్- 14కరాటే ఛాంపియన్‌షిప్‌కు అర్హత సాధించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే నివాసంలో గురువారం విద్యార్థికి సన్మానం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బాలురతో పాటు బాలికలకు కరాటే ఎంతో అవసరం అని అన్నారు. కరాటేలో మంచి నైపుణ్యం ప్రదర్శించి రాష్ట్రానికి మంచి పేరు తీసుకరావాలని కోరారు. కరాటే గ్రాండ్ మాస్టర్ రాజానాయక్, మాస్టర్ కిషోర్, నాయకుడు మహేష్‌నాయక్ పాల్గొన్నారు.

కొత్త పంథా నేరాలపై జాగ్రత్త వహించాలి


విజిబుల్ పోలీసింగ్ చేపడుతున్న ఇన్‌స్పెక్టర్ సూర్యానాయక్

మన్సూరాబాద్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సమాజంలో కొత్త పంథాల్లో వివిధ రకాల నేరాలు జరుగుతున్నాయని, వాటి పట్ల ప్రజలు చాలా అప్రమత్తత వహించాలని నాగోల్ ఇన్‌స్పెక్టర్ ఎ.సూర్యానాయక్ సూచించారు. విజిబుల్ పోలీసింగ్ లో భాగంగా బుధవారం రాత్రి నాగోల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నాగోల్ నుంచి సాయినగర్ వరకు పాదయాత్ర ద్వారా కాలనీలతో పాటు ప్రధాన రోడ్లపై తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా సైబర్ ట్రాఫికింగ్, అక్రమ రవాణా తదితరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ మొబైల్ ఫోన్లలో వస్తున్న పలు రకాల యాప్స్ ద్వారా సైబర్ నేరగాళ్ల చేతుల్లో సామాన్య ప్రజలు మోసాలకు గురవుతున్నారని, ఆ యాప్స్ పట్ల జాగ్రత్త వహించాలని సూచించారు. ఎక్కడైనా గంజాయి, ఇతర మత్తు పదార్థాల క్రయవిక్రయాలు, వినియోగాలు జరిగితే వెంటనే తమకు సమాచారం అందించాలని, ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే వారెంతటి వారైనా ఉపేక్షించమని హెచ్చరించారు. ఎస్‌ఐ శివనాగప్రసాద్, ఎస్‌ఐ హీనాషేక్, సిబ్బంది పాల్గొన్నారు.

పార్కుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు : శ్వేతారెడ్డి


పార్కు అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శ్వేత

సైదాబాద్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): డివిజన్‌లో పార్కుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఐఎస్‌సదన్ కార్పొరేటర్ జంగం శ్వేతారెడ్డి తెలిపారు. గురువారం డీఎస్‌నగర్, సెంట్రల్ ఎక్సైజ్ కాలనీలో పార్కు అభివృద్ధి నిర్మాణ పనులను కార్పొరేటర్ ప్రారంభించారు. గ్రేటర్‌లోనే ఐఎస్‌సదన్ డివిజన్‌లో అధికంగా పార్కులు ఉన్నాయని చెప్పారు. ప్రణాళికాబద్ధంగా అన్ని పార్కులు సుందరీకరణ చేస్తున్నట్లు వెల్లడించారు. భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్ రెడ్డి, ప్రశాంత్, రమేష్, జగన్, నర్సింగరావు, ధన్‌రాజ్, ధీరజ్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయ ఆదాయం రూ.23.52లక్షలు


కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయంలో వేలంపాటలో జిల్లా దేవాదాయ శాఖ ఏసీ టి.శేఖర్, ఈఓ ప్రేమ్‌కుమార్‌రావు

చంపాపేట, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయంలో గురువారం రంగారెడ్డి జిల్లా దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ టి.శేఖర్ పర్యవేక్షణలో ఆలయ ఇన్‌చార్జి ఈఓ వి.ప్రేమ్‌కుమార్‌రావు సమక్షంలో పార్కింగ్ నిర్వహణ, కొబ్బరి చిప్పల సేకరణ, అమ్మవారి చీరల సేకరణ కోసం నిర్వహించిన వేలంపాటల్లో ఆలయానికి రూ.23.52లక్షల ఆదాయం వచ్చింది. పార్కింగ్ నిర్వహణను ఏ.నరేష్ రూ.16.80లు, కొబ్బరి చిప్పల సేకరణను జి.సుభాష్ రూ.5.61లక్షలు, అమ్మవారి చీరల సేకరణను ఏ.రాధిక రూ.1.11లక్షలకు వేలం పాటల్లో దక్కించుకున్నారు. కొబ్బరికాయలు, పూజాసామగ్రి విక్రయం వేలంపాటను వాయిదా వేశారు.

అత్యాచారం కేసులో నిందితుడికి జైలు, జరిమానా

రంగారెడ్డి కోర్టులు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): అత్యాచారం కేసులో నిందితుడికి పదమూడవ అదనపు జిల్లా కోర్టు కఠిన కారాగార శిక్షతో పాటు జరిమానా విధిస్తు తీర్పు చెప్పారు. పీపీ మంజులదేవి కథనం ప్రకారం.. ఆర్‌జీఐ పోలీస్‌స్టేషన్ పరిధిలో నివసించే ఫరీద్(31) వ్యాపారి. బాధితురాలితో పరిచయం పెంచుకున్నాడు. ఆ చనువుతో ఒక రోజు ఇంట్లో అందరూ నిద్రిస్తుండగా అర్ధరాత్రి బాధితురాలి ఇంటికి వచ్చి తలుపు తట్టాడు. దీంతో బాధితురాలు తలుపు తీయగా ఆమెను వేరే గదిలోకి తీసుకెళ్లి పెళ్లి చేసుకుంటానని చెప్పి ఆమెపై అత్యాచారం చేశాడు. ఈ విషయాన్ని మరుసటి రోజు బాధితురాలు తన తల్లికి చెప్పింది. అతనిని పిలిపించి పెళ్లి చేసుకోమని అడగడంతో అతను నిరాకరించాడు. దీంతో తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు విచారించి సాక్ష్యాధారాలతో సహా కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. సాక్షులను విచారించిన పదమూడో అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి వాణి నిందితుడికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ. 6వేలు జరిమానా విధిస్తు తీర్పు చెప్పారు.

ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు


బడంగ్‌పేట్ మునిసిపల్ కార్యాలయంలో వాల్మీకి జయంతి వేడుకల్లో మేయర్ పారిజాతారెడ్డి, కార్పొరేటర్లు, అధికారులు

సరూర్‌నగర్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను గురువారం బడంగ్‌పేట్ కార్పొరేషన్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వాల్మీకి మహర్షి జయంతిని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని నిర్ణయం తీసుకోవడం హర్షించదగ్గ విషయమని అన్నారు. పురాణేతిహాసాల్లోని గొప్ప వ్యక్తులను స్మరించుకునే అవకాశాన్ని ఈ ప్రభుత్వం కల్పించిందని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి, బీజేపీ ఫ్లోర్ లీడర్ తోట శ్రీధర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ యాతం పవన్‌కుమార్‌యాదవ్, కార్పొరేటర్లు పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, సుక్క శివకుమార్, గూడెపు ఇంద్రసేన, రాళ్లగూడెం సంతోషిశ్రీనివాస్‌రెడ్డి, నిమ్మల సునీతాశ్రీకాంత్‌గౌడ్, మునిసిపల్ మేనేజర్ బి.నాగేశ్వర్‌రావు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ వి.యాదగిరి, మునిసిపల్ ఏఈఈ విసీల్‌గౌడ్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు రాకేశ్, శేషిరెడ్డి, టీపీఎస్ లాలప్ప పాల్గొన్నారు.


పెద్దఅంబర్‌పేట్ మున్సిపల్ కార్యాలయంలో వాల్మీకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్ జయశ్రీరాజు, కమిషనర్ రవీందర్‌రెడ్డి


తుర్కయంజాల్ మున్సిపల్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న మేనేజర్ శ్రీధర్‌రెడ్డి తదితరులు

పెద్దఅంబర్‌పేట్ మున్సిపల్ కార్యాలయంలో..

అబ్దుల్లాపూర్‌మెట్: మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను పెద్దఅంబర్‌పేట్ మున్సిపల్ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి చిత్రపటానికి చైర్‌పర్సన్ పండుగుల జయశ్రీరాజు, కమిషనర్ రవీందర్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీఈఈ శివానందం, మేనేజర్ కిరణ్‌కుమార్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

తుర్కయంజాల్‌లో..

తుర్కయంజాల్ మున్సిపల్ కార్యాలయంలో వాల్మీకి చిత్రపటానికి కమిషనర్ అమరేందర్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మేనేజర్ శ్రీధర్‌రెడ్డి, ఆర్‌వో శ్రీనివాసులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారి విస్తరణ పనులను పరిశీలించిన ట్రాఫిక్ డీసీపీ


హయత్‌నగర్‌లో జాతీయ రహదారి పనులను పరిశీలిస్తున్న ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాసులు, కార్పొరేటర్లు

హయత్‌నగర్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ వద్ద జరుగుతున్న జాతీయ రహదారి విస్తరణ పనులను ఎల్బీనగర్ ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాసులు హయత్‌నగర్ కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, పోలీస్ అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా హయత్‌నగర్ పుల్లారెడ్డి స్వీట్‌హౌజ్, టేస్టీ బేకరి వద్ద ట్రాఫిక్ సమస్యలను పరిశీలించారు. రోడ్డు విస్తరణ కారణంగా హయత్‌నగర్ నుంచి ఆటోనగర్ వరకు యూటర్న్‌లు మూసీ వేయడంతో వాహనదారులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని హయత్‌నగర్ కార్పొరేటర్ డీసీపీకి వివరించారు. రోడ్డుకిరువైపుల వందల సంఖ్యలో కాలనీలు ఉన్నాయని చిన్నచిన్న పనుల కోసం రోడ్డుపైకి వస్తే దగ్గర్లో యూటర్న్‌లు లేకపోవడం మూలంగా సుమారు మూడు కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. వాహనదారుల సమస్యలను దృష్టిలో పెట్టుకుని యూటర్న్‌ల సంఖ్యను పెంచాలని డీసీపీని కోరారు. జాతీయ రహదారుల అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్, గట్టు మల్లు, సీఐ నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై కొనసాగుతున్న ప్రభుత్వాల వివక్ష : మల్లు లక్ష్మి



మాట్లాడుతున్న మల్లు లక్ష్మి

సరూర్‌నగర్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నేటికీ మహిళలపై వివక్ష కొనసాగిస్తూనే ఉన్నాయని, మహిళల రక్షణలో రెండు ప్రభుత్వాలూ పూర్తిగా విఫలమయ్యాయని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి ఆరోపించారు. మహిళలు తమ హక్కులను పోరాటాల ద్వారానే సాధించుకోవాల్సిన పరిస్థితి నెలకొన్నదని, ఆ దిశలో ప్రతి మహిళా ఉద్యమించాల్సిన అవసరం ఉన్నదని ఆమె అన్నారు. ఐద్వా 4వ మహాసభలు బుధవారం రాత్రి మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని నందిహిల్స్‌లో గల ఓ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న లక్ష్మి మాట్లాడుతూ హక్కులు సాధించుకోవడమే కాకుండా సదరు హక్కులకు రక్షణ సైతం కల్పించుకోవాల్సిన అవసరం ఉన్నదని అన్నారు. ప్రభుత్వాల వివక్ష కొనసాగినంత కాలం మహిళలు అన్ని రంగాల్లో వెనుకబడిపోతూనే ఉంటారని, ఆ దుస్థితి నుంచి బయటపడాలంటే పోరాటాలే మార్గమని ఆమె పేర్కొన్నారు. మహిళల రక్షణలో, వారికి హక్కులు కల్పించడంలో ముందున్నామంటూ ప్రకటనలు గుప్పించే ప్రభుత్వాలు ఆచరణలో మాత్రం వివక్ష ప్రదర్శిస్తూనే ఉన్నాయని విమర్శించారు. రాష్ట్రంలో మహిళలు, యువతులు, బాలికలపై జరుగుతున్న అఘాయిత్యాలకు, దాడులకు వ్యతిరేకంగా ఐద్వా ఉద్యమిస్తుందని ఆమె చెప్పారు. త్వరలో దీనిపై కార్యాచరణ రూపొందించుకుని పోరాటం చేపడతామని లక్ష్మి పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కళ్లు తెరిపించేలా ఐద్వా తన పోరాటాలను ముమ్మరం చేయనున్నదని ఆమె స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు జ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధులు కె.భాస్కర్, జగదీశ్, ప్రకాశ్‌కారత్, బాలాపూర్ మండల ప్రతినిధులు యాదయ్య, విజయ, యాదగిరిచారి పాల్గొన్నారు.

ఐద్వా జిల్లా అధ్యక్షురాలిగా సుమలత

సమావేశం అనంతరం ఐద్వా రంగారెడ్డి జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా కె.సుమలత, ప్రధాన కార్యదర్శిగా ఎం.విజయలక్ష్మి, మరో 12 మందిని కార్యదర్శివర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

ఆలయాలకు దాతలు సహకరించాలి

● జీహెచ్ఎంసీ మాజీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ సురేఖ


సాయిబాబా మందిర శంకుస్థాపన కార్యక్రమంలో జీహెచ్ఎంసీ మాజీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ దేప సురేఖ భాస్కర్‌రెడ్డి దంపతులు, స్థల దాత బండపల్లి రీత సంతోష్ దంపతులు

ఎల్‌బీనగర్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మహేశ్వరం నియోజకవర్గం ఆర్‌కేపురం డివిజన్ పరిధిలోని గ్రీన్‌హిల్స్‌కాలనీలో సాయిబాబా మందిర శంకుస్థాపన శిలాఫలకం కార్యక్రమంలో జీహెచ్ఎంసీ మాజీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ దేప సురేఖ భాస్కర్‌రెడ్డి దంపతులు పాల్గొన్నారు. సాయిబాబా మందిరానికి గ్రీన్‌హిల్స్‌కాలనీ వాసులు బండపల్లి రీతా సంతోష్ దంపతులు తమ స్థలాన్ని విరాళంగా అందజేశారు. శిలాఫలకాన్ని గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దేప సురేఖ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ రీతా సంతోష్ దంపతులు తమ సొంత స్థలాన్ని సాయిబాబా మందిర నిర్మాణం కోసం విరాళంగా అందజేయడం అభినందనీయమన్నారు. ఆలయాలకు దాతలు సహకరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి, గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండి మధుసూదన్‌రావు, గట్ల రవీంద్ర, పిట్ట హరినాథ్‌రెడ్డి, నల్లెంకి ధన్‌రాజ్ గౌడ్, కుంచారపు సురేంద్రకుమార్, తలాటి రమేష్‌నేత, దినేష్‌సింగ్, భూపాల్ రెడ్డి, నగేష్, లింగస్వామిగౌడ్, ఎస్ఎస్‌యూఐ శివ, జంగారెడ్డి, సిద్దు తదితరులు పాల్గొన్నారు.

భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ పనులకు నిధులు మంజూరు చేయాలి


జలమండలి ఎండీకి వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

వనస్థలిపురం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లోని శివారు కాలనీలకు నూతన భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ పనులకు నిధులు మంజూరు చేయాలని జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్‌రెడ్డికి కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ శివారు కాలనీలలో ప్రజలు భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. భూగర్భ డ్రైనేజీ లేకపోవడంతో రోడ్ల నిర్మాణం చేపట్టలేకపోతున్నామని దీంతో కాలనీలోని వృద్ధులు, మహిళలు, చిన్నపిల్లలు రోడ్లపై తిరగలేని పరిస్థితులు నెలకొన్నాయన్నారు.

హోమియోపతి ఆస్పత్రిని పరిశుభ్రంగా తీర్చిదిద్దాలి

బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ ఎన్జీవోస్ కాలనీలోని ప్రభుత్వ హోమియోపతి ఆస్పత్రిని సంబంధిత సిబ్బంది ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని కార్పొరేటర్ లచ్చిరెడ్డి సూచించారు. హోమియోపతి ఆస్పత్రిలో చెత్త, చెట్ల కొమ్మలు విరిగిపడిపోవడంతో పేరుకపోయిన చెత్తను తొలగించాలని ఆస్పత్రి వైద్యురాలు నర్మద కార్పొరేటర్‌కి సమాచారం అందించారు. తక్షణమే స్పందించిన కార్పొరేటర్ సంబంధిత సిబ్బందితో ఆస్పత్రిలోని చెత్త, ఇతర వ్యర్థ పదార్థాలను గురువారం తొలగించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఎస్ఎస్ అజీముద్దీన్, జవాన్ యాదయ్య, సంజీవరెడ్డి, పవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బేకరీపై అసత్య ప్రచారం.. ఇద్దరు యువకులపై కేసు


హయత్‌నగర్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): బేకరీపై అసత్య ప్రచారం చేసిన ఇద్దరు యువకులపై హయత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మంగళవారం రాత్రి 8 గంటల సమయంలో వీరేష్, నర్సింహనేత ఇద్దరు హయత్‌నగర్ సమీపంలోని సంగం బేకరీ వద్దకు చాయ్ తాగడానికి వెళ్లారు. హోటల్‌లో చాయ్‌ను అపరిశుభ్రంగా తయారుచేసి ఇస్తున్నారని సోషల్ మీడియాలో పోస్టులు పెట్టి ప్రచారం చేశారు. దీంతో హోటల్‌లో పని చేస్తున్న అన్వర్ మనోభావాలను దెబ్బతీసేలా వారిద్దరు సోషల్ మీడియాలో ప్రచారం చేశారని సంగం హోటల్ మేనేజర్ విష్ణు గురువారం హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భర్తతో గొడవ పడి భార్య అదృశ్యం




సైదాబాద్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): భర్తతో గొడవపడి ఓ మహిళ ఇంటి నుంచి బయటకు వెళ్లి కనిపించకుండాపోవడంతో కుటుంబసభ్యులు సైదాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గ్రీన్‌పార్క్ కాలనీలో నివాసముండే స్కూల్ టీచర్ మన్న సతీష్‌కుమార్ ఆరు నెలల క్రితం సాయిలక్ష్మి(30)ని ప్రేమ వివాహం చేసుకున్నాడు. కొద్ది రోజులుగా వీరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈనెల 10న బ్యూటీ పార్లర్‌కు వెళ్తున్నానని చెప్పి ఇంట్లో లెటర్ రాసి బయటకు వెళ్లింది. తన అదృశ్యంపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే ఆత్మహత్య చేసుకుంటానని లెటర్‌లో పేర్కొంది. తర్వాత ఇన్‌స్టాగ్రామ్‌లో తాను హాస్టల్‌లో ఉంటున్నానని, స్వతంత్రంగా జీవించాలని ఉందని తెలియజేసింది. ఆమె ఆచూకీ కోసం వెదకగా దొరకకపోవడంతో బుధవారం సైదాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆహ్వానం


ఆటోనగర్‌లోని హరిణవనస్థలిలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఈనెల 20న నిర్వహించే దసరా మేళా కార్యక్రమానికి హాజరు కావాలని కోరుతూ ఆహ్వాన పత్రికను టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్‌కు అందజేస్తున్న పద్మశాలి సంఘం ఎల్బీనగర్ అధ్యక్షుడు పున్నా గణేష్ నేత, మేళా అధ్యక్షులు కౌకుట్ల రవితేజ, ప్రధాన కార్యదర్శి గడ్డం లక్ష్మీనారాయణ, రవీందర్, జగన్నాథం తదితరులు. - వనస్థలిపురం, ఆంధ్రజ్యోతి

భూసేకరణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి : దేవిరెడ్డి


ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

బర్కత్‌పుర: మూసీ సుందరీకరణకు తాము వ్యతిరేకం కాదని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తెలియజేశారు. 2013లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన భూసేకరణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గురువారం ఎల్బీనగర్ నియోజకవర్గం చైతన్యపురి డివిజన్‌లోని లక్ష్మీనర్సింహ కాలనీవాసులతో కలిసి బషీర్‌బాగ్ పరిశ్రమల భవన్‌లో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను కలిసి ఎమ్మెల్యే వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, లక్ష్మీనర్సింహ కాలనీలో 30 దళిత కుటుంబాలు నివసిస్తున్నాయని 15 రోజులుగా వారు నివసిస్తున్న ఇళ్లను కూల్చివేస్తామని అధికారులు భయాందోళనకు గురిచేస్తున్నారని ఆరోపించారు. బాధిత కుటుంబాలు పట్టా భూమిలో ప్రభుత్వం అనుమతితో ఇళ్లను నిర్మించుకున్నారని, వారికి ఎలాంటి ప్రత్యామ్నాయం చూపడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మూసీ సుందరీకరణ బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే ప్రారంభమైందని, అందుకు గాను మాజీ సీఎం కేసీఆర్ రూ. 3,800 కోట్లను కేటాయించారని గుర్తుచేశారు. మూసీ సుందరీకరణకు తాము వ్యతిరేకం కాదని కానీ మూసీ సుందరీకరణ పేరుతో బాధితులకు అన్యాయం చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. బాధితులకు అన్యాయం జరగకుండా చర్యలు తీసుకుంటామని, భూసేకరణ చట్టం అమలయ్యేలా చూస్తామని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ హామీ ఇచ్చారు.


ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి ఆహ్వానపత్రికను అందజేస్తున్న భాగ్యలక్ష్మి ఆలయం ట్రస్టీ శశికళ

అమ్మవారిని దర్శించుకోవాలని ఎమ్మెల్యేకు ఆహ్వానం

చంపాపేట, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగను పురస్కరించుకొని చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకోవాలని కోరుతూ ఆలయ ట్రస్టీ శశికళ గురువారం ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డికి ఆహ్వానపత్రికను అందజేశారు. కార్యక్రమంలో కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయ మాజీ ధర్మకర్త మధుసాగర్ తదితరులు పాల్గొన్నారు.


తీగల కృష్ణారెడ్డిని సన్మానిస్తున్న టీడీపీ హస్తినాపురం డివిజన్ అధ్యక్షుడు గిరి

మాజీ ఎమ్మెల్యే తీగలను కలిసిన టీడీపీ నేతలు

చంపాపేట, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఇటీవల ఏపీ సీఎం చంద్రబాబునాయుడును కలిసిన మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డిని గురువారం టీడీపీ హస్తినాపురం డివిజన్ అధ్యక్షుడు గిరి మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గిరి మాట్లాడుతూ టీడీపీలో చేరి పార్టీకి పూర్వ వైభవం తీసుకరావాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ డివిజన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మూసీ నిర్వాసితులకు రెసిడెన్షియల్‌లో ప్రవేశం

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మూసీ అభివృద్ధిలో భాగంగా ఇళ్లు కోల్పోయిన రెండు కుటుంబాలకు చెందిన ముగ్గురు విద్యార్థులకు రాష్ట్ర రెసిడెన్షియల్ పాఠశాలలో ప్రవేశం దక్కింది. జీహెచ్ఎంసీ అర్బన్ కమ్యూనిటీ విభాగం అదనపు కమిషనర్ చంద్రకాంత్‌రెడ్డి టీజీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి ప్రశాంతితో మాట్లాడి ఎంట్రన్స్‌టెస్ట్ లేకుండానే ప్రవేశం కల్పించారు. ఎల్బీనగర్ నియోజకవర్గానికి చెందిన మాధవి (7వ తరగతి), శిరీష (8వ తరగతి), తేజస్వి(5వ తరగతి)ని యూసీడీ సిబ్బంది సరూర్‌నగర్‌లోని రెసిడెన్షియల్ స్కూల్‌లో చేర్పించారు.

ఖైదీలకు వేతనాల పెంపు

సైదాబాద్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): శిక్ష అనుభవిస్తూ జైళ్లలో పనిచేస్తున్న ఖైదీలకు వేతనాలను పెంచడానికి ప్రభుత్వం అంగీకరించిందని, ఈ నెల నుంచి అమలు చేస్తున్నామని ఇటీవల జరిగిన ఓ కార్యక్రమంలో జైళ్ల శాఖ డీజీ సౌమ్యమిశ్రా తెలిపారు. హైస్కిల్డ్ వారికి ప్రతిరోజూ రూ. 200, స్కిల్డ్ వారికి రూ.150, సెమీ స్కిల్డ్ వారికి రూ.125, అన్ స్కిల్ కూలీలకు రూ.50 చెల్లించనున్నట్లు వెల్లడించారు.

రేపు ఉచిత గైనకాలజీ శిబిరం

దిల్‌సుఖ్‌నగర్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): చైతన్యపురి గీత మల్టీ స్పెషాలిటీలో ఉచిత గైనకాలజీ శిబిరాన్ని ఈనెల 19న నిర్వహిస్తున్నట్లు ప్రముఖ స్త్రీ, ప్రసూతి వైద్యురాలు డాక్టర్ సత్యశ్రీ వెల్లడించారు. శనివారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు గీత ఆస్పత్రి ఆవరణలో నిర్వహించనున్న వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.